# కళ్యాణి ప్రాజెక్ట్ గేట్లు ఎత్తివేత

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 2: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కళ్యాణి ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. దీంతో ప్రాజెక్ట్ అధికారులు రెండు రేడియల్ గేట్లను సోమవారం ఎత్తివేశారు. ప్రాజెక్టులోకి 700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, రేడియల్ గేట్ల ద్వారా 600 క్యూసెక్కుల వరదను మంజీరాలోకి వదులుతున్నారు. 100 క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి మళ్లించారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 409.50 మీటర్లు కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో నీటిమట్టం 407.50 మీటర్లకు చేరుకుంది. ఎగువ ప్రాంతం నుంచి వరద పెరిగితే దానికి తగినట్లుగా నీటిని మంజీరాలోకి వదులుతామని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. ఆయకట్టు రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**పొంగిపొర్లుతున్న పోచారం ప్రాజెక్టు**



పోచారం ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న వరదనీరు

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ : మండలంలోని పోచారం ప్రాజెక్టు పొంగి ప్రవహిస్తోంది. సోమవారం ప్రాజెక్టు మూడు ఫీట్లు(36 ఇంచులతో నిండుగా పొంగి పొర్లింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1464 ఎంసీఎఫ్‌టీ( 1.82 టీఎంసీలు) కాగా ఆదివారం పూర్తి స్థాయికి చేరుకున్నది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 50వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా అదే స్థాయిలో ప్రాజెక్టు నుంచి వరద నిజాంసాగర్ ప్రాజెక్టులోకి చేరుకుంటున్నట్లు నీటి పారుదలశాఖ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టు ప్రధాన కాలువ ఆయకట్టుకు అనుసంధానంగా ఉన్న గొలుసు చెరువులు పూర్తిగా నిండి పోవడంతో..ప్రధాన కాలువ నుంచి నీటి విడుదలను పూర్తిగా నిలిపివేసినట్లు చెప్పారు. మంజీరా పరీవాహక ప్రాంతాల రైతులు అప్రమత్తంగా ఉండాలని, పొలాల వద్దకు వెళ్లవద్దని, పశువులు, జీవాలను బయటికి వదలవద్దని సూచించారు. పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో..మాజీ జడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ప్రాజెక్టు వద్ద ఉన్న గంగమ్మ ఆలయంలో సోమవారం 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

**పోచారం ప్రాజెక్టును సందర్శించిన ఎస్పీ**

పోచారం ప్రాజెక్టును సోమవారం ఎస్పీ సింధూ శర్మ సందర్శించారు. ప్రాజెక్టుపైకి చేరుకొని వరదను పరిశీలించారు.లోతట్టు ప్రాంతాలు, ప్రాజెక్టు వివరాలను డీఎస్పీ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున ప్రాజెక్టు వద్దకు సందర్శకులను రానివ్వవద్దన్నారు. సెల్ఫీలు తీసుకోనివ్వవద్దన్నారు. ప్రాజెక్టు వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. మంజీరా పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న పెంకుటిండ్లలో ఉన్న కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించి వసతులు కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎస్పీ వెంట సీఐ రవీందర్, ఎస్సై మల్లారెడ్డి, నీటి పారుదలశాఖ ఏఈ ప్రశాంత్ తదితరులు ఉన్నారు.



పోచారం ప్రాజెక్టుపై డీఎస్పీ శ్రీనివాస్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ సింధుశర్మ

# కామారెడ్డి పట్టణాభివృద్ధికి రూ. 93 కోట్లు



సమావేశంలో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి, సెప్టెంబర్ 2 : కామారెడ్డి పట్టణ అభివృద్ధి కోసం కేటాయించిన రూ. 93 కోట్ల నిధులతో శాశ్వత డ్రైనేజీ, తాగునీటి సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, కామారెడ్డి జిల్లా నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అమృత్ 2.0 పథకం కింద నీటి సరఫరా, డ్రైనేజీ పనులపై నిజామాబాద్, కామారెడ్డి నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో నీటి నాణ్యత, పంపిణీని మెరుగుపరచడానికి ప్రాజెక్టులు రూపొందించినట్లు తెలిపారు. సమావేశంలో కామారెడ్డి డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, నాయకులు పాల్గొన్నారు.

















